batukammanews.com
TEL/2019/78873
# బతుకమ్మ
తాజా వార్తల సద్దిమూట
27 అక్టోబర్ 2026
మంగళవారం

## చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

స్మార్ట్‌ఫోన్లను దూరం పెట్టి.. క్రీడా మైదానాల వైపు విద్యార్థులను నడిపించండి
పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారంతో కృషి చేస్తా
మెండోరా మండల 70వ అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను ప్రారంభించిన
బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

4 లో



# మాదవనగర్ ఆర్‌వోబి నిధుల లొల్లి

- 2024 నుంచి నిలిచిపోయిన పరిపాలన అనుమతులు
- నాలుగు వారాల క్రితం రూ.2 కోట్ల నిధులతో పనులు
- రెండు రోజుల క్రితం సీఎంను కలిసిన రాని ఉత్తర్వులు
- నేడు బీజేపీ ఆధ్వర్యంలో మరోసారి ధర్నా

నిజామాబాద్ నగరంలో ప్రధాన రహదారిపై ఉన్న మాదవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిధులు విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాకు పిలుపునిచ్చింది. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురితో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో పాటు నగర పాలక సంస్థలోని 28 మంది కార్పరేటర్లతో ధర్నా చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్ ప్రకటించారు. ఇప్పుడు ఈ వ్యవహారం హాట్ గా మారింది. భారతీయ జనతా పార్టీ గడిచిన మూడు సంవత్సరాల్లో మాదవనగర్ ఆర్ వోబికి నిధులు విడుదల చేయాలని ధర్నా చేయడం రెండవసారి. గతంలోనూ బీజేపీ ఆందోళనకు పిలుపునిచ్చిన ప్రతీసారి ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం అన్నది పరిపాటిగా మారింది. దానితో బీజేపీ తన మేనిఫెస్టోలో పెట్టిన ఆర్ వోబిని పూర్తి చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ధర్నాకు సిద్ధమైంది. నిజామాబాద్ నగరంకు ప్రధాని రహదారిపై హైదరాబాద్ రోడ్డులో ఉన్న మాదవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఉమ్మడి రాష్ట్రం నుంచి కలగానే ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆర్ వోబి కోసం బీజేపీ ఎంపీ అర్వింద్ ధర్మపురి తనదైన శైలిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తాల ఆధ్వర్యంలో నిర్మాణానికి సిద్ధమయ్యారు.

– నిజామాబాద్, బతుకమ్మ

2 లో



## పాత బియ్యంకు
# కొత్త ధర దేనికి ?

ఇప్పుడు అమ్మేది పాత బియ్యమే కదా..! పాత ధరలో కొన్న వడ్ల బియ్యమే కదా..




2 లో

ప్రపంచంలో ఎక్కడ యుద్ధాలు జరిగినా, ఏ ప్రకృతి విపత్తులు సంభవించిన మన భారత దేశం లో మధ్యతరగతి, పేద , సామాన్య ప్రజలు మాత్రం నష్టపోతునే ఉన్నారు. తాజాగా ఎల్నినో పరిస్థితుల పేరుతో గత సంవత్సరం తక్కువ ధరకు కొనుగోలు చేసిన వడ్ల నుంచి వచ్చిన బియ్యానికి అడ్డగోలుగా ఎక్కువ ధరలు వసూలు చేస్తూ దళారులు సొమ్ము కుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

– నిజామాబాద్, బతుకమ్మ

## తుమ్మిడిహెట్టి బ్యారేజిపై
# అధ్యయనానికి నిర్ణయం

2 లో

ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ వివాదాన్ని పరిష్కరించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నిరంతర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈరోజు (సోమవారం) ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథి గృహంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కీలక భేటీ జరిగింది.

– వెబ్ డెస్క్, బతుకమ్మ






## గాజుల సౌమ్యకు భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక స్మారక జ్ఞాపిక

### కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంస్మరణ జ్ఞాపికను కుటుంబ సభ్యులకు అందజేసిన డీపీఈవో

2 లో

విధి నిర్వహణలో అసాధారణ సాహసం ప్రదర్శించి ప్రాణాలర్పించిన దివంగత ప్రొహిబిషన్ ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య త్యాగాన్ని గుర్తించి భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక స్మారక జ్ఞాపికను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ (ఎన్‌ఫోర్స్ మెంట్) డైరెక్టర్ ఆదేశాల మేరకు స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భారత

– నిజామాబాద్ క్రైం, బతుకమ్మ

# సిఐటియు మహాధర్నాకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున కదిలిన కార్మిక వర్గం



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఈ నెల 25, 26 తేదీలలో హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు సిఐటియు పిలుపునిచ్చిన మేరకు జిల్లా నుంచి అంగన్వాడీ, ఆశ, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజనం , బీడీ, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున కదిలి హైదరాబాదులోని ఇందిరా పార్కు చేరుకున్నారు. ఈ ధర్నాలో ఆయా రంగాల కార్మికులు తో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర గౌడ్, ఉపాధ్య క్షులు ఏ రమేష్ బాబు ,దేవగంగు, స్వర్ణ, చంద్రకళ, జంగం గంగాధర్ ,గణేష్, సుకన్య, స్వప్న తదితరులతో పాటు పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం 42 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని , లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావడం జరిగిం దన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తాను ఇచ్చిన హామీలను అమలు జరగని యెడల ఈ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. లేనియెడల డిసెంబరు ఒకటి ,రెండు ,మూడు, తేదీలలో ఢిల్లీలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం తమ నిరసనను తెలియజేస్తా మన్నారు. దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# నేడు బాన్సువాడకు మంత్రి సీతక్క రాక





### పలు అభివృద్ధి పనులకు . . . కొత్త భవనాలకు భూమిపూజ

### అధికారులు,ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సమావేశం

బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, నూతన నిర్మాణాలకు భూమిపూజ చేసేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనసూయ సీతక్క మంగళవారం బాన్సువాడలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కొయ్యగుట్ట తాండలో నూతన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. బాన్సువాడ పట్టణంలోని 3వ వార్డులో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని, బోర్లం గ్రామ శివారులో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు.మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాజీ ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బాన్సువాడ గ్రామీణ మండలం కొయ్యగుట్ట తాండలో నూతన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి భూమిపూజ, మధ్యాహ్నం 3 గంటలకు: బాన్సువాడ పట్టణంలోని 3వ వార్డులో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవం, 3:30 గంటలకు బోర్లం గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో చేపట్టి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు.

# బాన్సువాడలో తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

### టియూఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్త




బాన్సువాడ బతుకమ్మ : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణ మే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి నివాసానికి ముట్టడికి బయలుదేరిన బాన్సువాడ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టియూఎఫ్) ఆధ్వర్యంలో అక్టోబర్ 26న సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు బయలుదేరిన ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా టియూఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్త మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడే ళ్లు కావస్తున్నప్పటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభు త్వం ఐదు నెలల క్రితం ఏర్పాటు చేసిన కేకే కమిటీ కాలయాపనకే పరిమితమైందని ఆరోపించారు. హామీల అమలు కోసం ఉద్యమకా రులు ఆందోళనలకు సిద్ధమవు తుంటే రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల మేరకు ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించా లని గంగాధర్ గుప్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పం దించక పోతే నవంబర్ నెలలో కచ్చితంగా ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిసామని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎదురైన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ఎదురవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అరెస్టయిన వారిలో టియూఎఫ్ బాన్సువాడ మండల అధ్యక్షుడు కాల్వ శ్యామ్, ప్రధాన కార్యదర్శి దమ్మణపేట భాస్కర్ గౌడ్, ఎద్దుబల్లె కృష్ణ, అగ్గవే దత్తు, గైని గంగారామ్, పల్లికొండ సాయిలు, బుర్రిగారి మహేష్ తదితరులు ఉన్నారు.

# బెల్టు షాపులు నిషేధించాలని ప్రజావాణిలో వినతి..



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామంలో ఉన్న బెల్టు షాపులను నిషేధించాలని సోమవారం ప్రజావాణిలో గ్రామపంచాయతీ పాలకవర్గం వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పి. గంగమ్మ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రజల ఆరోగ్య దృష్ట్యా షాపులను నిషేధించాలని తీర్మానించారు. ఎవరైనా తీర్మానాన్ని అతిక్రమించి బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తే గ్రామపంచాయతీ నుండి 50 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని నిర్ణయించారు. వినతి పత్రం అందించిన వారిలో గ్రామ సర్పంచ్ పి. గంగమ్మ -గంగారాం, ఉప సర్పంచ్ టి. అర్చన తదితరులు ఉన్నారు.

# బాల్కొండ ఇంచార్జి ఎస్సైగా యాసిర్ అర్ఫాత్



బాల్కొండ, బతుకమ్మ:బాల్కొండ ఇంచార్జి ఎస్సైగా యాసిర్ అర్ఫాత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఎస్సైగా పని చేసిన శైలేంధర్ పలు అవినీతి ఆరోపణలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. జిలా అధికారుల అనుమతి లేకుండా ఇద్దరు పోలీసులను మహారాష్ట్రకు పంపడం పట్ల జిల్లాలో తీవ్ర సంచలనంగా మారింది. ఎస్సై శైలేంధర్ పై విచారణ కొనసాగుతుండగానే ఆయన స్థానంలో సీపీ ఇంచార్జిని నియమిం చినట్లు తెలిసింది. ఎస్సై యాసిర్ అర్ఫాత్ 2024లో బాల్కొండలో దాదాపు రెండు నెల లు విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న యాసిర్ అర్ఫాత్ ను బాల్కొండ ఇంచార్జి ఎస్సైగా ఉన్నతాధికారులు నియమించారు.

# ఏటీఎం చోరీ కేసులో నిందితుడి అరెస్టు




కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా గాంధారిలో ఎస్‌బీఐ ఏటీఎంలో రూ. 25.45 లక్షల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. సోమవారం కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ మాట్లాడుతూ ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి రాజస్థాన్‌కు చెందిన రషీద్ (30)ను అరెస్టు చేశారు. నల్లరంగు స్కార్పియో, నగదు, మొబైల్ ఫోన్లు, గ్యాస్ కట్టింగ్ పరికరాలు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు.

# సేవాదళ్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంధి బెన్సన్ రాజు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : సేవాదళ్ కాంగ్రెస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సంధి బెన్సన్ రాజు ను నియమిస్తూ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేశారు. పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా సంధి బెన్సన్ రాజు సోమవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బెన్సన్ రాజు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి జిల్లా సేవాదళ్ కాంగ్రెస్ అధ్యక్షునిగా అవకాశం కల్పించిన పిసిసి మహేష్ కుమార్ గౌడ్ కి, రాష్ట్ర సేవాదళ్ ఇంచార్జ్ యూసఫ్ జాహీకి, అలాగే రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్‌రికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే నా నియామకానికి ప్రత్యేక కృషిచేసిన బోధన్ శాసనసభ్యులు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ లకు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో క్రమశిక్షణ,నిబద్ధతతో నిర్వర్తించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# పిట్లంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్



పిట్లం, బతుకమ్మ : పిట్లం మండలంతో పాటు అన్నారం, చిల్లర్గి, పోతిరెడ్డిపల్లి, రాంపూర్ గ్రామాల్లో సోమవారం వరి కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామ్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సీఈఓ సంతోష్ రెడ్డి ఉన్నారు.

## బాధిత కుటుంబాలని పరామర్శించిన మానాల మోహన్ రెడ్డి



కమ్మర్ పల్లి, బతుకమ్మ : కమ్మర్ పల్లి మండలంలోని అమీర్ నగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త వర్ణం రాములు కుమారుడు వర్ణం నర్సయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో వారి కుటుంబాన్నిమాజీ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులు మనోధైర్యం తో ఉండాలని కోరారు. అలాగే కొనసాముందర్ గ్రామంలో దాసరి కమల ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలియజేసి, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు భాస్కర్, తీప్పిరెడ్డి శ్రీనివాస్, సుంకేటా రవి, బుచ్చి మల్లయ్య, పడిగేలా ప్రవీణ్ రెడ్డి, మురళి, సంజీవ్, వివిధ గ్రామ సర్పంచ్లు, ఉప సర్పంచ్ లు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఇందూరు నుంచి శబరిమలకు పాదయాత్ర దైవనిర్ణయం



ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : శబరిమలకు పాదయాత్రగా వెళ్లడం అనేది దైవ నిర్ణయం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఇందూరు శ్రీధర్మశాస్త్ర పాదయాత్రను సోమవారం నగరంలోని అయ్యప్ప ఆలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహా పాదయాత్రలో పాల్గొంటున్న స్వాములందరికి ఎటువంటి ఆటంకాలు కలుగకుండా విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మొత్తం 40 మంది స్వాములు సుమారు 45 రోజులపాటు పాదయాత్రగా శబరిమల చేరుకుంటారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అయ్యప్ప మాల ఎంతో పవిత్రమైందని, మాలాధారనతో పాదయాత్రగా వెళ్లడమనేది మరింత కఠినమైందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, గుండయ్య గురుస్వామి, ఆగమయ్య గురుస్వామి, పాదయాత్ర స్వాములు పాల్గొన్నారు.

## సింగూరు నుంచి రోజు విడిచి రోజు బల్క్ నీటి సరఫరా

సింగూర్, బతుకమ్మ : ఎల్ నినో ప్రభావంతో సింగూరు జలాశయంలో నీటి మట్టం తగ్గుతున్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్టోబర్ 26 సోమవారం నుంచి బల్క్ నీటి సరఫరాను రోజు విడిచి రోజు అందించాలని నిర్ణయించినట్లు మిషన్ భగీరథ అధికారి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ జలాశయంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు తాగునీటి సరఫరాను ఎక్కువ కాలం కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 26న ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు బల్క్ నీటి సరఫరా, 27న బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలకు బల్క్ నీటి సరఫరా, ఇదే విధంగా తదుపరి రోజుల్లో కూడా రోజు విడిచి రోజు నీటి సరఫరా కొనసాగుతుందని తెలిపారు.

నీటి సరఫరా లేని రోజుల్లో స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించుకోవాలని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు సూచించినట్లు వెల్లడించారు.ప్రజలు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణలో అధికారులకు సహకరించాలని మిషన్ భగీరథ అధికారి

# చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

### స్మార్ట్‌ఫోన్లను దూరం పెట్టి.. క్రీడా మైదానాల వైపు విద్యార్థులను నడిపించండి

### పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారంతో కృషి చేస్తా

### మెండోరా మండల 70వ అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను ప్రారంభించిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




మెండోరా, బతుకమ్మ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను తమ జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని, నిత్యం ఆటలాడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతుందని బాల్కొండ శాసనసభ్యులు, మాజీ మంత్రి శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాంగణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెండోరా మండల స్థాయి 70 వ అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను (అండర్-14, అండర్-17 విభాగాల్లో) సోమవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి, విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు.మార్చ్ ఫాస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనబరచిన పాఠశాలలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మెండోరా మండల పరిధిలోని పాఠశాలలకు మంజూరైన నూతన భవనాలు, అదనపు గదుల నిర్మాణ పనులు నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా 'మన ఊరు - మన బడి' పథకం కింద వివిధ పాఠశాలల్లో చేపట్టిన కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడలు, టాయిలెట్ల నిర్మాణాలకు సైతం చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పనులను మధ్యలోనే వదిలివేసే దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయమై తాను ఇప్పటికే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయడంతో పాటు ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలు, మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మరోమారు ఆర్థిక శాఖ మంత్రిని స్వయంగా కలిసి ఒత్తిడి తెస్తానని స్పష్టం చేశారు. మండల విద్యాశాఖ అధికారి కోరిన మేరకు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన డ్యూయల్ డెస్క్ బల్లల కొరతను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. తమ కుటుంబ వియ్యంకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త దయానందరెడ్డి ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛందంగా డ్యూయల్ డెస్కులు, కంప్యూటర్లు సమకూర్చి విద్యార్థుల విద్యకు అండగా నిలిచారని ప్రస్తావించారు. అలాగే చాకిర్యాల్ పాఠశాలలో అవసరమైన వసతుల కోసం స్థానిక సర్పంచ్ చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ.. గ్రామ వీడీసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు అవసరమైన వివరాలతో వేల్పూరులోని క్యాంప్ కార్యాలయంలో తనను సంప్రదిస్తే దయానందరెడ్డి సహకారంతో తగిన వసతులు సమకూర్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.నేటి సాంకేతిక యుగంలో విద్యార్థులు టీవీలు, స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్లకు బానిసలై మైదానాలకు దూరమవుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులను ఫోన్లకు దూరంగా ఉంచి, ప్రతిరోజూ సాయంత్రం కనీసం గంటపాటు మైదానంలో ఏదో ఒక ఆట ఆడేలా తల్లిదండ్రులు బాధ్యతగా ప్రోత్సహించాలని కోరారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఆటల ద్వారానే జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను, వైఫల్యాలను తట్టుకునే మానసిక స్థైర్యం (స్పోర్ట్స్‌మ్యాన్ స్పిరిట్) అలవడుతుందని, విద్యార్థులు ఎలాంటి నిరాశ, డిప్రెషన్‌లకు గురికాకుండా స్థిరచిత్తంతో ముందుకు సాగడానికి క్రీడలు దోహదపడతాయని హితవు పలికారు.తనది మొదటినుంచీ క్రీడా నేపథ్యం ఉన్న కుటుంబమని, తన తండ్రి నేషనల్, యూనివర్సిటీ వాలీబాల్ క్రీడాకారుడని, తాను కూడా జూనియర్ నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడినని, తన సోదరుడు యూనివర్సిటీ క్రికెట్ క్రీడాకారుడిగా, సోదరి స్టేట్ ఖో-ఖో ప్లేయర్‌గా రాణించారని గుర్తుచేసుకున్నారు. క్రీడలంటే ఉన్న అమితమైన మక్కువతోనే తాను ఎంతటి తీరికలేని పనుల్లో ఉన్నా క్రీడా కార్యక్రమాలకు తప్పక హాజరవుతానని స్పష్టం చేశారు. బాల్కొండ నియోజకవర్గాన్ని క్రీడారంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో సంపూర్ణంగా సహాయసహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో అధికారం చేపట్టిన తర్వాత క్రీడాకారులకు, క్రీడారంగానికి మరింత ఉన్నతమైన ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చారు.మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను సొంత ఇంటి పనుల్లా బాధ్యతగా భావించి సమర్థవంతంగా నిర్వహిస్తున్న మండల పీఈటీలు విద్యాసాగర్, రాజ్‌కుమార్, గంగాధర్, రమేష్, శ్రీనివాస్, ప్రభాకర్‌ల అంకితభావాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మనస్ఫూర్తిగా అభినందించారు. అలాగే కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చిన పోచంపాడ్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ధర్మపురి, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ మాధురి రాజు, స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ధర్మపురి, పోచంపాడ్ సర్పంచ్ మాధురి రాజు, డీసీసీబీ డైరెక్టర్ మెండోరా మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి,ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మణ్, మండల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు), ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) లో అధికారికంగా నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామా యణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. సమాజంలో సత్ప్రవర్తన, సమానత్వం, సోదరభావం పెంపొందిం చేందుకు వాల్మీకి బోధనలు ఎంతగానో దోహదపడతా యని తెలిపారు. మహర్షి వాల్మీకి చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయికుమార్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్, బీసీ సంఘాల నాయకులు బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్, బస్సాపూర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో కలకలం

### కుటుంబంతో సహా ఆత్మహత్యకు అనుమతివ్వాలని ప్రజావాణిలో వినతి



జగిత్యాల, బతుకమ్మ : జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మ్యాడ గోవర్ధన్ తనకు న్యాయం జరగడం లేదంటూ భార్య, పిల్లలతో కలిసి ప్రజావాణిని ఆశ్రయించాడు. కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ అధికారుల ముందు తన ఆవేదనను వ్యక్తం చేశాడు. మెట్‌పల్లి--వెల్లుల్ల రోడ్డులో 2021లో నలుగురు భాగస్వాములతో కలిసి తనకు చెందిన షట్టర్‌లో మెడికల్ షాపు ఏర్పాటు చేసినట్లు గోవర్ధన్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒప్పందం ప్రకారం ఐదేళ్ల గడువు ముగిసి రెండు నెలలు గడుస్తున్నా షాపును తనకు తిరిగి అప్పగించడం లేదని ఆరోపించాడు. షాపును అప్పగించాలని భాగస్వామి సంతోష్‌ను కోరగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని, దీంతో షాపు వద్దకు వెళ్లేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేసి, సమస్యను పరిష్కరించాలని గోవర్ధన్ అధికారులను వేడుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## తాడ్కోల్ అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి.

### ముగ్గురు పట్టివేత

### రూ.50,280 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం

బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.50,280 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.సీఐ తుల శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం తాడ్కోల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురిని పట్టుకుని, వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లు, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పేకాట ఆడితే చర్యలు తప్పవని సీఐ తుల శ్రీధర్ అన్నారు. పేకాట, జూదం చట్టరీత్యా నేరమని , ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

# ఘనంగా లయన్ ఇందూర్ చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు...

### – లయన్స్ కంటి ఆసుపత్రిలో అన్నదానం...



రుద్రూర్, బతుకమ్మ: రుద్రూర్ గ్రామ మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ వ్యవస్థాపక సభ్యులు లయన్ ఇందూర్ చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్‌లోని లయన్స్ కంటి ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకున్న రోగులకు, వారి సహాయకులకు రోజువారీ ఓపీకి వచ్చిన రోగులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షులు లయన్ గుండూరు ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. పుట్టినరోజు జరుపుకుంటున్న లయన్ ఇందూర్ చంద్రశేఖర్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. పుట్టినరోజు సందర్భంగా పేద రోగులకు కడుపు నింపే ఈ అన్నదాన కార్యక్రమం ఎంతో విలువైనదని, సంతోషకరమైన విషయమని అన్నారు.
ఈ కార్యక్రమంలో జి.ఎస్.టి కోఆర్డినేటర్ లయన్ శ్యాంసుందర్ పహాడే, జిల్లా చైర్మన్ లయన్ కె.వి. మోహన్, క్లబ్ కోశాధికారి లయన్ పార్వతీ ప్రశాంత్, డైరెక్టర్ లయన్ పుట్టి సాగర్, దుర్గాదేవి కమిటీ అధ్యక్షులు ఇందూర్ కార్తీక్, రుద్రూర్ గ్రామ వార్డు సభ్యులు ఆమంద్ వెంకటేశ్వర్, పాత్రికేయులు బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.హెచ్.ఎం సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

### సమ్మెకు టీయూసీఐ, పీడీఎస్ యూ సంపూర్ణ మద్దతు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బంది 14 రోజులుగా చేస్తున్న సమ్మెకు టీయూసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, పీడీఎస్ యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.గణేష్, ఎల్. అనిల్ కుమార్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబాలు ధర్నా చౌక్ లో సమ్మె శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి, ప్రజల ప్రాణాలను కాపాడుతున్న ఎన్.హెచ్.ఎం సిబ్బంది న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ ఆరోగ్య భద్రత, ప్రసూతి సెలవులు లేకపోవడం దుర్మార్గమన్నారు. 14 రోజులుగా కొనసాగుతున్న సమ్మెతో సాధారణ ప్రజలు, ముఖ్యంగా పేషెంట్లు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలను ఎన్ హెచ్ ఎం సిబ్బందిని ఇబ్బంది పెడుతున్న రాష్ట్ర సర్కారు వైఖరిని తప్పుపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్ హెచ్ ఎం సిబ్బందితో చర్చలు జరిపి, వారి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. పి డి ఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.గణేష్,



అనిల్ కుమార్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగించాలని, ఎన్.హెచ్.ఎం సిబ్బంది సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కరించకపోతే ఎన్.హెచ్.ఎం సిబ్బందితో కలిసి ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మొద్దు .

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మొద్దని, ఎలినినోపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ తో కలిసి నగేష్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ ప్రభుత్వం వచ్చి 3సంవత్సరాలలో గత 2సంవత్సరాలలో పుష్కలంగా వర్షాలు పడ్డాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన కరెంట్ ఇచ్చారని, కానీ దురదృష్టవశాత్తు ఈ సంవత్సరం ఎలినినో ప్రభావం వలన వర్షాలు సరిగా పడలేవని ఈ ప్రభావం ప్రపంచంలోని 110 దేశాలతో పాటు,మన దేశం,మన రాష్ట్రమలో కూడా ఉందని దీన్ని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు అని అనడం వారి అవివేకానికి నిదర్శమన్నారు. జిల్లాలోని ముఖ్య నాయకుల చొరవతో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కరెంట్ సరఫరా చేసి, రైతులు నష్టపోకుండా వారిని ఆదుకున్నామని తెలిపారు.ఈ సంవత్సరం కూడా ముందస్తుగా పడిన వర్షాలతో నిజాంసాగర్ లో 10టీఎంసీ నీటి నిల్వతో అదేవిదంగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుతో 40టీఎంసీ లతో రైతులకు కొంత ఊరట కలిగిందన్నారు.రాష్ట్రంలో గతంలో విద్యుత్ వినియోగం 13వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం




### ఎలినినోపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి

చేస్తుంటే ఈ సంవత్సరం రాష్టంలో సుమారు 20వేల మెగావాట్ల విద్యుత్ వినియోగి స్తునారన్నారు.మన జిల్లాకు 300మెగావాట్ల యూనిట్ల కోట ఉంటే రైతులను ఆదుకోవాలని 750 మెగావాట్లను వినియోగించుకోవడం జరిగిందన్నారు.అంటే సగటుగా రోజు 500మెగావాట్ల విద్యుత్ను వాడుతున్నామన్నారు .అయినా ప్రతి పక్షాలు మాట్లాడుతు ఈ ఎలినినో తెచ్చింది రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నారని ప్రతిపక్షాలకు సిగ్గుండి మాట్లాడుతున్నారో సిగ్గులేకుండా మాట్లాడుతున్నారో ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు.ఆనాడు కరోనా వచ్చిన సమయంలో ఈ బిఆర్ఎస్ ప్రభుత్వం ఉందని కరోనా యావత్తు ప్రపంచం మొత్తం వచ్చిందని, ప్రతి పక్ష పార్టిగా మా కాంగ్రెస్ పార్టీ అప్పటి ప్రభుత్వానికి మద్దతు తెలిపామే తప్ప ఏనాడు కరోనాను బిఆర్ఎస్ తెచ్చి ప్రజల ప్రాణాలు తీసిందని అనలేదన్నారు.అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కరోనాను పట్టించుకోకుండా కరోనాకు ఒక పారాసిటమాల్ వేసుకుంటే పోతుందని అవహేళన చేసిన ప్రతిపక్ష పార్టీగా ఒక మాట కూడా అనలేదన్నారు. కెసిఆర్ మాటల వలన చాలా మంది అమాయక ప్రజలు ఇండ్ల నుండి బయటికి వచ్చి కరోనాతో తమ ప్రాణాలను కొల్పోయరన్నారు. ఈ ఎలినినో వలన వర్షాలు పడకపోతే హరీష్ రావ్, కేటిఆర్ లు రేవంత్ రెడ్డి మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడ్తునరన్నారని, బిడ్డ హరీష్, కేటిఆర్ మీ మాటలకు వ్యతిరేకంగా మేము కూడా మీ తోలు తీస్తాం, చీరెస్తాం అనచ్చు కానీ మాది కాంగ్రెస్ పార్టీ గాంధేయా పార్టీ మాకు ఒక పద్దతి ఉందని ప్రతిపక్ష పార్టీలను గౌరవించే పార్టీ కాంగ్రెస్ ది అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రతి పక్ష పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకు 500బోనస్ ఇచ్చిన ఘనత మాది అని,ఈ సిజన్లో వివిధ రాష్టం నుండి వ్యాపారులు ఇక్కడి రైతుల వద్దకి వచ్చి ప్రస్తుతం దాదాపు 3200నుండి 3400వరకు సన్న వడ్లను కొంటున్నారంటే రేవంత్ రెడ్డి కారణమని తెలిపారు.రైతులు రెండవ పంటగా వరిని వేయకుండా అరుతడి పంటలు వేయాలని కోరారమని, ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడాలని గ్రామ స్థాయిలో కూడా ప్రజలు నీటిని వృధా చేయకుండా వాడాలని కోరారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ , రాష్ట ఊర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, రాష్ట కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్,నగర మేయర్ ఉమారాణి, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి,రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యులు రామకృష్ణ,జిల్లా ర్ సెల్ అధ్యక్షులు యాదగిరి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కౌడవ్ శరత్,గాదారి గోపి, రత్నాకర్ గౌడ్,జిల్లా పార్టీ కోశాధికారి భక్త వత్సలమ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాల నర్సయ్య,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రాజా నరేందర్ గౌడ్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్,జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, ప్రవీణ్ గౌడ్,కార్పొరేటర్లు ఎర్రం గంగాధర్,అహ్మద్, రవి, గణేష్,రఘు, నరేందర్, కిషన్,మహిళా కాంగ్రెస్ నాయకులు అపర్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చోలా ఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన యూటీయూసి జిల్లా కమిటీ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ చోలాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటియూసి జిల్లా కన్వీన ర్ కటారి రాములు మాట్లాడుతూ చోలా ఫైనాన్స్ సంస్థ అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తూ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పేద, మధ్యతరగతి వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. సిబ్బంది మాట్లాడుకుందామని పిలిచి, కేవలం మూడు నెలల డిఫాల్ట్ కూడా పూర్తికాకముందే ఆటోను స్వాధీ నం చేసుకున్నారని తెలిపారు. అనంతరం రూ.2,000 సీజింగ్ ఛార్జీలు, కేవలం రెండు గంటల వ్యవధిలోనే పార్కింగ్ ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమని అన్నారు. వాహన రుణాల విషయంలో ఫైనాన్స్ సంస్థలు పాటించాల్సిన నియామాలకు విరుద్ధంగా చోలా ఫైనాన్స్ వ్యవహరి స్తోందని ఆయన పేర్కొన్నారు. పేద ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు రుణాల ద్వారా జీవనోపాధి పొందుతున్నారని, వారిపై ఒత్తిడి తీసుకు రావడం, ముందస్తు సమాచారం లేకుండా వాహనాలను స్వాధీనం చేసు కోవడం తగదన్నారు. చోలా ఫైనాన్స్ సంస్థపై సమగ్ర విచారణ జరిపి, బాధిత వినియోగదారులకు న్యాయం చేయాలని, అక్రమ వసూళ్లను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ , నరేష్ పాల్గొన్నారు.

# అసైన్ మెంట్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

### ఎమ్మార్పీఎస్ జుక్కల్ మండల అధ్యక్షులు యస్ బాలాజీ డిమాండ్



జుక్కల్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని అసైన్ మెంట్ భూములకు లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు కల్పించాలని జుక్కల్ మండల తాసిల్దార్ మరోతికి ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు.ఎమ్మార్పీఎస్ జుక్కల్ మండల అధ్యక్షులు యస్.బాలాజీ మాదిగ, ముఖ్య అతిథులు జుక్కల్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు ఆయిల్ వార్ మరోతి మాదిగ వినతి పత్రం ఇచ్చి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాదిగ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేసి దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్, రాజు యువ వికాస్, ఎస్సీ సాబ్ ప్లాన్ నిధులు, అంబేద్కర్ అభయ హస్తం 12,00,000 లక్షలు ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి సంక్షేమ పథకాల ద్వారా మాదిగలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జలసిరి పనులపై క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : ఎల్‌నినో నేపథ్యంలో భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా జలసిరి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సోమవారం జలసిరి పనుల గుర్తింపు పై గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రుద్రూర్ గ్రామంలోని జేయన్సీ కాలనీలో, కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు వర్షపు నీటిని నిల్వ చేసుకునే నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చయాలన్నారు. ఇంకుడు గుంతలను నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ అరవింద్, ఏఓ సాయి కృష్ణ, ఆర్ ఐ భారతి, ఐకేపి ఏపిఎం బస్వంత్ రావు, హౌసింగ్ ఏఈ సౌజన్య, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి

### నాళేశ్వర్ గ్రామ రైతులకు నవీపేట్ మండల వ్యవసాయాధికారి నవీన్ కుమార్ సూచన



నవీపేట్, బతుకమ్మ : ఎల్‌నినో ప్రభావం, రాబోయే రోజుల్లో వ్యవసాయ పరిస్థితులు, నీటి లభ్యతపై నాళేశ్వర్ గ్రామంలో వ్యవసాయాధికారి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నవీన్ కుమార్ మాటాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో సాగునీటితో పాటు తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. నీరు అధికంగా అవసరమయ్యే వరి పంట సాగును తగ్గించి, స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా కంది, పెసర, మినుము, శనగ, ఇతర ఆరుతడి పంటలను సాగు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దుంప విజయ్, సర్పంచ్ ఆర్మూర్ లావణ్య, ఉపసర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, లిఫ్ట్ చైర్మన్ పుప్పాల భోజన్న, సొసైటీ మాజీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు, రైతులు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## ఢిల్లీ హిందూస్థాన్ మారథాన్‌లో సత్తా చాటిన బస్వాపూర్ యువకుడు

### కోల్ కతా ఇంటర్నేషనల్ మారథాన్‌కు సెలెక్ట్



భిక్కనూరు,బతుకమ్మ :దేశ రాజధాని ఢిల్లీ మహానగరంలో నిన్న ఆదివారం నిర్వహించిన హిందూస్థాన్ మారథాన్ రన్ లో భిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన రాఖ షాదుల్ అద్భుత ప్రతిభ కనబరిచాడు ఈ మారథాన్ లో దేశవ్యాప్తంగా 3 వేలకు పైగా రన్నర్లు పాల్గొనగా 10 కిలోమీటర్ల పరుగు పందెంలో షాదుల్ కేవలం 38 నిమిషాల 47 సెకన్లలోపూర్తి చేసి 12వ స్థానంలోనిలిచాడు ఈరన్ లో అత్యుత్తమ ప్రతిభ కినబరిచిన టాప్ 50 మంది రన్నర్లను డిసెంబర్ నెలలో కోల్ కతా మహానగరంలో జరగబోయే ఇంటర్నేషనల్ మారథాన్ రన్ కు ఎంపిక చేయగా అందులో బస్వాపూర్ యువకుడూఖ షాదుల్ సెలెక్ట్ కావడం విశేషంఈ సందర్భంగా గ్రామ ప్రజలు యువకులు హర్షం వ్యక్తం చేస్తూ షాదుల్ కు అభినందనలు తెలిపారు గ్రామానికి చెందిన యువకుడు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమని అన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష



నందిపేట్, బతుకమ్మ : నందిపేట మండల కేంద్రం లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ లో దొరికిన 5 గురి ని సోమవారం రోజున సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ తాగి వాహనం నడిపిన వ్యక్తి సూర్యాపేట కు చెందిన శివరాత్రి రాజన్న కి 4 రోజుల జైలు శిక్ష మరియు మిగతా నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి 10000 రూపాయల చొప్పున మొత్తం 40000 జరిమానా విధించడం జరిగింది, ఎస్సై వినయ్ కుమార్ మాట్లాడుతూ తాగివాహనాలు నడిపినవారిపై చట్టరీత్య చర్యలు చేపడుతాం అని సూచించారు.

## ఆటో అదుపు తప్పి పలువురికి గాయాలు



ఎల్లారెడ్డి, బతుకమ్మ : ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని శ్రీ ఉమా సంగమేశ్వర ఆలయ కొండపై ఆటో ప్రమాదానికి గురైంది. కామారెడ్డికి చెందిన భక్తులు దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా ఆటో అదుపుతప్పి గుంతలో పడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ తాజుద్దీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గ్రామస్తుల సహాయంతో ఎల్లారెడ్డి పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఆరుతడి పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి







### ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రబీ సీజన్లో రైతులను ఆదుకోవాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పూర్ భూమయ్య,దేశెట్టి సాయి రెడ్డిలు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రైతులను వరి పంట వేయవద్దంటూ అలాగే రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని కలెక్టర్ ని కోరారు. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, జొన్న, కుసుమ, ఆవాలు, పెసర, మినుము, శనిగలు, తదితర పంటల వైపు రైతులను ప్రోత్సహించి ఈ పంటలకు విత్తనాలు ప్రభుత్వమే ఎస్సీ ఎస్టీ రైతులకు ఉచితంగా, మిగతా రైతులకు 80 శాతం సబ్సిడీపై ఇవ్వాలని వారు కోరారు. ఖరీఫ్ సీజన్లో తీసుకున్న రైతుల రుణాలను వాయిదా వేసి రబి సీజన్ గాను కొత్త రుణాలు ఇవ్వాలి. అలాగే పశుగ్రాస కొరతను నివరించడానికి గడ్డి విత్తనాలను, ధాన్యాలను 80శాతం సబ్సిడీ పై అందించి పాడి పశువు గొర్రె మేక రైతులను ఆదుకోవాలి అన్నారు. యంత్ర లక్ష్మిలో రైతులకు సరిపడా అన్ని రకాల యంత్రాలను 80 శాతం సబ్సిడీతో అందించాలి గ్రామాలలో ఉపాధి పనులను విస్తరించి సంవత్సరానికి ఒక మనిషికి రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలి అలాగే రోజుకు 700 రూపాయలు కూలి ఇవ్వాలి. ఎల్ నినో ను అడ్డం పెట్టుకొని వ్యాపారస్తులు నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచుతున్నారని వారన్నారు. గత సంవత్సరం సన్న బియ్యం కింటాల్ మీద 3000 నుండి 3500 వేలకు పెరిగినవి. రేషన్ షాపులలో ఒక్కొక్కరికి ప్రస్తుతం ఇస్తున్న ఆరు కిలోలకు బదులు ప్రతి ఒక్కరికి 12 కిలోల చొప్పున ఇవ్వాలని అలాగే బియ్యంతో పాటు ఇతర పప్పులు నూనెలు చింతపండు తదితర 12 రకాల వస్తువులను అందించి ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వాలు రైతులకు , రైతు కూలీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కిసాన్ సమ్మాన్ నిధి 12 వేలకు బదులు 20,000 రూపాయలకు పెంచాలని, అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు చెల్లించాలని వారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇస్తానన్న సంవత్సరానికి 12,000 బకాయిలతో సహా చెల్లించాలని కరెంటును నిరంతరంగా 12 గంటల పాటు ఇవ్వాలని అన్నారు. మంచిప్ప 21 ప్యాకేజి కి తగిన నిధులు కేటాయించి సత్వారమే పనులు పూర్తి చేయాలనీ వారు కోరారు. కరువు నివారణ చర్యలు చేపట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న విపత్తు నిధులను కేటాయించాలి. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టి ప్రజలను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి. సాయిలు, ఎల్. పర్వన్న, సహాయ కార్యదర్శి దేద వత్ బన్సీ, జిల్లా నాయకులు ఎస్. అనంతయ్య. ఎస్. విట్టల్, నర్సాగౌడ్, రాపాని గంగాధర్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు భూమయ్య, మల్లికార్జున్, శివకుమార్, జేపీ గంగాధర్,శంకర్, ఎలాప్ప, అశోక్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు మాధవనగర్ బ్రిడ్జి వద్ద బీజేపీ నిరసన దీక్ష

ఇందూర్, బతుకమ్మ : మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఇందూర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మాధవనగర్ రైల్వే బ్రిడ్జి వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన దీక్షలో ఇందూర్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్, ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి, పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజెపి రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ బ్రిడ్జి మంజూరు కోసం ఎంపి ధర్మపురి అర్వింద్ చేయని ప్రయత్నం లేదని, కేంద్ర ప్రభుత్వ వాటాను 25 శాతం నుంచి ఏకంగా 50 శాతానికి పెంచి పూర్తి నిధులు మంజూరు చేయించారన్నారు. బ్రిడ్జి పనులు ప్రారంభమైన నాటి నుంచి గతంలో అర్వింద్ కి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నేడు కమీషన్ల కక్కుర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం పనులను అటకెక్కించిందని ఆరోపించారు. మాధవనగర్, అర్సపల్లి రెండు బ్రిడ్జిల నిర్మాణాల జాప్యానికి రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వమే కారణమని అన్నారు. మాధవనగర్ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని గతంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ దీక్ష చేపడితే నాపైన, పార్టీ నాయకులు పైన అక్రమ కేసులు బనాయించారని, ఇప్పటికీ తాము కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ప్రజా సమస్యలపై పోరాటం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మాధవనగర్ బ్రిడ్జి అడీషనల్ ప్రపోజల్ దాదాపు ?9 కోట్ల ప్రతిపాదనలపై ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఎంపీ అర్వింద్ కలిసి నిధుల ఫైలును ఫైనాన్స్ విభాగానికి పంపించారు. అయితే గత రెండు సంవత్సరాలుగా ఆ ఫైలును ఫైనాన్స్ విభాగంలో తొక్కిపెట్టి నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. మరోవైపు, 100 శాతం కేంద్ర నిధులతో చేపడుతున్న అర్సపల్లి రైల్వే బ్రిడ్జికి భూసేకరణ చేసి ఇవ్వాలని కోరుతుంటే, అర్వింద్ ధర్మపురి దీక్ష చేస్తున్నారని తెలిసిన కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్ర ప్రభుత్వమే నిధులు విడుదల చేస్తుందంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. కనీస పరిజ్ఞానం లేకుండా కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మాధవ్ నగర్ రైల్వే బ్రిడ్జికి నిధులు విడుదల చేయాలనీ, పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. నిజామాబాద్ అర్బన్, రూరల్



నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాభివృద్ధి కమిటీలు, ఆటో యూనియన్లు, వర్తక-వ్యాపార సంఘాలు, కుల సంఘాల నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పెట్రోల్ పంపు యాజమాన్యాలు, వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ దీక్షకు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

### సమయపాలన పాటించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 121 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రశేఖర్లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, పెండింగ్ అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇదిలాఉండగా,



ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడం, కొంతమంది ఆలస్యంగా హాజరు కావడాన్ని గమనించిన కలెక్టర్, ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అయ్యే నిర్ణీత సమయం ఉదయం 10.30



గంటల వరకు అధికారులు అందరూ హాజరు అయి ఉండాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్లవద్దని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నెలకొని ఉన్న పరిస్థితుల గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు అవగాహన సదస్సులలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రక్షిత్ కుటుంబానికి ఆర్మీ సైనికుల ఆర్థిక సాయం

### మానవత్వాన్ని చాటుకున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రీయల్ టైగర్స్ సైనికులు

బోధన్, బతుకమ్మ : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన రక్షిత్ మృతి చెందడంతో చలించిపోయిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆర్మీ సైనికులు మానవత్వాన్ని చాటుకున్నారు. రక్షిత్ కుటుంబం కష్టకాలంలో ఉందని తెలుసుకున్న సైనికులు ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.30,500 లు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యుడిని



కోల్పోయిన బాధలో ఉన్న రక్షిత్ కుటుంబానికి తమ వంతు సహాయం అందించి, వారికి రియల్ టైగర్ సభ్యులు మనోధైర్యాన్ని కల్పించారు. దేశ రక్షణలో నిరంతరం సేవలందించే సైనికులు, తోటి మనిషి కష్టంలో ఉన్నప్పుడు కూడా స్పందిస్తూ తమ సేవా భావాన్ని చాటుకోవడం పలువురిని ఆకట్టుకుంది. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్మీ సైనికుల సేవాభావంపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ప్రతీ సైనికుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఉమ్మడి నిజామాబాద్ రియల్ టైగర్స్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగాధర్ తో పాటు సైనికులు కె.రమేష్, బి.సురేష్, ఆర్.రాజు, ఏ.ఎన్ గౌడ్, ఎం.అనిల్, విఠల్ తో పాటు పలువురు సైనికులు పాల్గొన్నారు.

# మానవతా సదన్' చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిచ్ పల్లి, బతుకమ్మ : డిచ్ పల్లిలోని మానవతా సదన్ చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. డిచ్ పల్లిలో కొనసాగుతున్న మానవతా సదన్ ను కలెక్టర్ సోమవారం సాయంత్రం సందర్శించారు. సుమారు రూ. 8.25 కోట్ల రూపాయలను వెచ్చిస్తూ మానవతా సదన్ లో నూతనంగా నిర్మించదల్చిన భవన సముదాయాల కోసం స్థల పరిశీలన జరిపారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న నిర్మాణాలు, కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, డార్మెటరీ, ప్లే గ్రౌండ్, లైబ్రరీ తదితర వాటిని కలెక్టర్ సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. కొత్తగా నిర్మించిన వాటిని వినియోగిస్తూ, పాత భవనాల గదులను కూల్చివేసి వాటి స్థానంలో అన్ని సదుపాయాలతో కూడిన డార్మెటరీలు, కిచెన్, డైనింగ్ హాల్ లను బాలబాలికలకు వేర్వేరుగా నిర్మించాలని అధికారులకు సూచించారు. అనాథ పిల్లల కోసం ఉద్దేశించిన ఈ పనులను పక్కాగా, ప్రణాళికాబద్ధంగా నిర్దేశిత నమూనా మేరకు జరిపించాలని, ఎక్కడ కూడా చిన్నపాటి అవకతవకలకు తావు ఉండకూడదని అన్నారు.





నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, తానే స్వయంగా నిర్మాణ పనుల నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తానని తెలిపారు. వెంటనే పనులను చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అప్పటివరకు మానవతా సదన్ బాలబాలికలకు నడిపల్లిలోని సీ.ఎం.సీ కళాశాలకు చెందిన హాస్టల్ భవనంలో వసతి కల్పించాలని సూచించారు. కాగా, మానవతా సదన్ కు చెందిన బాల బాలికలు ఎంతో శ్రద్ధతో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ ను చూసి కలెక్టర్ అభినందించారు. సదన్ నిర్వహణ తీరుతెన్నుల గురించి ఎంతో ఆసక్తితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న వనరులను, జిల్లా యంత్రాంగం తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. తాము అనాథలం, తమకు తల్లితండ్రులు లేరు అనే భావన పిల్లల దరి చేరకుండా వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు సమకూర్చేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చొరవ చూపుతోందని అన్నారు. ఈ సందర్భంగా సదన్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంను కలెక్టర్ ప్రశంసిస్తూ, చిన్నారులకు తన వెంట తెచ్చిన బహుమతులను అందజేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, తహసీల్దార్ సతీష్, ఎంఈఓ జి.నరేష్, మానవతా సదన్ లైజనింగ్ ఇంచార్జ్ సుధాకర్, రమేష్ తదితరులు ఉన్నారు.

# మద్నూర్‌లో వైభవంగా ప్రారంభమైన కార్తీక మాస ప్రభాత భేరి

మద్నూర్, బతుకమ్మ : ఆధ్యాత్మిక మాసమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో సాంప్రదాయ బద్ధంగా ప్రభాత భేరి (ప్రభాత ఫేరి) సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఏటా నిర్వహించే ఈ పరంపరలో భాగంగా, స్థానిక శ్రీ బాలాజీ మందిరం నుండి ఉదయం 4:50 గంటలకే భక్తులు భజన కీర్తనలు, భక్తి గీతాలతో గ్రామం లోని వీధివీధినా సంకీర్తనలు చేస్తూ ముందుకు సాగారు. వాడవాడలా తిరుగుతూ మార్గమ ధ్యంలోని పలు ఆలయాల్లో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఉదయం 6:00 గంటలకు తిరిగి శ్రీ బాలాజీ మందిరానికి చేరుకుని, అక్కడ మహా మంగళ హారతితో నేటి ప్రభాత భేరిని ముగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గత 45 సంవత్సరాలుగా మద్నూర్‌లో ఈ కార్తీక మాస ప్రభాత భేరి అప్రతి హతంగా కొనసాగుతోందని తెలిపారు. నాడు కేవలం నలుగురు సభ్యులతో చిన్నగా ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం, నేడు వందలాది మంది భక్తుల భాగస్వామ్యంతో ఒక పెద్ద పండుగలా మారిందని పేర్కొన్నారు. కార్తీక మాసం అంతా ఈ ప్రభాత భేరి నిరంతరాయంగా కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పూజారి శంకుబా అప్పా, ప్రముఖ నిర్వాహకులు గోవింద్ సేఠ్ కాకా, హనుమాన్ శర్మ, సురేష్ సేఠ్ మోదాని, సురేష్ ఉడుతావార్, రఘుబర్ కుశాల్ కుమార్ లతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, వృద్ధులు మరియు భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



# ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన ఎన్ హెచ్ఎం ఉద్యోగులు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఎన్ హెచ్ ఎం (జాతీయ ఆరోగ్య మిషన్) ఉద్యోగులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని సోమవారం కలిసి తమ సమస్యలను వివరించి, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. గత 14 రోజులుగా డిమాండ్ల పరిష్కారం కొరకు సమ్మె చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ



తమ ఉద్యోగాలకు తగిన భద్రత, వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 78 కేడర్లలో పనిచేస్తున్న 17,541 మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి, తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు సమాన వేతనాలు, పే స్కేల్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీవో నంబర్ 60, 1195 ప్రకారం పెరిగిన వేతనాలను తక్షణమే అమలు చేసి, ఉద్యోగులకు న్యాయం చేయాలని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, 8 శాతం లయబిలిటీ బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జిల్లా జేఏసీ యూనియన్ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు అవార్హులైన వారికి కేటాయించాలి




మోర్తాడ్, బతుకమ్మ: సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ మోర్తాడ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని తాహాసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి,, తాహాసీల్దార్ ద్వారా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇంద్రమ్మ ఇండ్లను లాట రీ పద్దతి ద్వారా కాకుండా అర్హులైన వారికి ఇండ్లు కేటాయించాలని సమస్యలతో కూడిన మెమొరండాన్ని ఇవ్వడం జరిగింది. సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఏర్గట్ల మోర్తాడ్ సంయుక్త మండ లాల కార్యదర్శి జి.కిషన్, మండల నాయకులు, వి. సత్తెమ్మ తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్ ) మాస్ లైన్ ప్రజా (పంథా) మండల నాయకులు, దహల్ సింగ్, దండ్ల అంజలి, గంగక్క , గోపి, సౌందర్య ,శంకర్ , చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనంగా ఐరా పుట్టిన రోజు వేడుక

### అన్నర్థులకు అన్నదానం, పేదలకు నిత్యావసర వస్తుల పంపిణి



భీమ్ గల్, బతుకమ్మ :పుట్టిన రోజు వేడుక అంటే ఫ్లెక్సీలు కట్టి ఫంక్షన్ హాల్ లో కేక్ కట్ చేసి,అందరు అయిన వారిని పిలుచుకొని అత్యంత ఆర్భాటంగా, విలాసవంతంగా నిర్వహించుకొనే ఈ రోజుల్లో గుమ్ముల ఐరా పుట్టిన రోజు వేడుక ఆదర్శనంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే వేల్పూర్ మండలం రామన్నపేట్ కు చెందిన గుమ్ముల ఉపేందర్ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉపేందర్, శిరీష దంపతుల కూతురు ఐరా పుట్టిన రోజును పురస్కరించుకొని తన దేశంలోని తను పుట్టిన ఊరు రామన్నపేట్ లో, తన ముత్తగారి ఊరిలో భీమ్ గల్ మండలంలోని మెండోరా లో వంద పేదలకు అన్నదానం చేశారు. ఎల్ నీనో పరిస్థితుల దృష్ట్యా 12 మంది పేద కుటుంబాలకు 15 రోజులకు సరిపడ నిత్యావసర వస్తువులను పంపిణి చేశారు. తెలంగాణ ఐ కె పి ఉద్యోగుల సంఘం స్టేట్ ప్రెసిడెంట్ కుంట గంగారెడ్డి ప్రేరణ తో సెర్ప్ సీ.ఈ.ఓ దివ్య దేవారాజన్ భావజాలాన్ని స్ఫూర్తిగా తీసుకొని తన కూతురు పుట్టిన రోజును అమెరికాలో కాకుండా తన పుట్టిన నేలపై జరపడం జరిగిందని ఉపేందర్ బతుకమ్మ కు తెలిపారు.



## భాదిత కుటుంబానికి మానాల పరామర్శ



భీమ్ గల్, బతుకమ్మ :మండలంలోని పిప్రి, పల్లికొండ గ్రామాల్లో భాదిత కుటుంబాలను మాజీ డీసీసీ ప్రెసిడెంట్ మానాల మోహన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇందులో భాగంగా గ్రామ మాజీ ఎంపిటిసీ స్వామి అత్తమ్మ పొప్పల గంగామణి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్నిమానాల పరామర్శించారు. అనంతరం పల్లికొండ గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిషన్ కూతురు సుమలత గుండెపోటుతో మరణించగా వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమం లో భీంమ్ గల్ మున్సిపల్ చైర్మన్ బోదిరే స్వామి, వైస్ చైర్మన్ జేజే నర్సయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ ఉప అధ్యక్షులు నాగేంద్ర,కన్నె సురేందర్, ఉప సర్పంచ్ జేమ్స్, రత్నం, సురేష్, గోపాల్ ,మునీర్,రమేష్, రాజేష్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

### బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్




భీమ్ గల్, బతుకమ్మ :బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా అందురు కలిసి కట్టుగా పని చేయాలని పార్టీ కానిస్టెన్సీ ఇన్‌చార్జి శ్రీ ముత్యాల సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రజా భవన్లో భీమ్ గల్ పట్టణానికి చెందిన 12 వార్డుల పార్టీ ప్రెసిడెంట్లు ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ వారిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేయలని , పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్ గల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స అనంతరావు, చెప్పాల గణేష్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు అరిగెల జనార్ధన్, 11వ వార్డు కౌన్సిలర్ సంగ్య నాయక్, 8వ వార్డు కౌన్సిలర్ మమ్మరీ సందీప్, మండల అధికార ప్రతినిధి వాక మహేష్, ఉపసర్పంచ్ మంద గోవర్ధన్, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సేవాలాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చాంగుభాయ్‌కి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవి ఇవ్వాలి

### రూరల్ ఏమ్మెల్యే భూపతి రెడ్డికి సర్పంచ్ ల వినతి



డిచ్ పల్లి, బతుకమ్మ :నిజామాబాద్ మార్కెట్ చైర్ పర్సన్ పదవి ఎస్టీ లకు రిజర్వు అయినా నేపథ్యంలో బంజారా సామజిక వర్గానికి చెందిన చాంగు భాయి కి ఇవ్వాలని డిచ్ పల్లి మండలం సర్పంచ్ లు కోరుతున్నారు. డిచ్ పల్లి మండలం లోని బంజారా సర్పంచ్ లు అందరు కలిసి మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవిని తమ మండలానికి కేటాయించి, బంజారా నాయకురాలు మాజీ కార్పొరేటర్ చంగుబాయి ని అవకాశం ఇచ్చి మహిళా నేతలకు ప్రోత్సహించాలని కోరారు. ఈ మేరకు సోమవారం రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి కి విన్నవించారు

## ప్రపంచ తెలుగు మహాసభల పోటీల్లో బాచనపల్లి విద్యార్థినికి గుర్తింపు

### జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థినిగా గీతా లహరి



G. గీతాలహరి

భీమ్ గల్, బతుకమ్మ ప్రపంచస్థాయి నాలుగో తెలుగు మహాసభల సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన బాలల కథల పోటీలో బాచనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మి దో తరగతి విద్యార్థిని గీతా లహరి గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు పొందడం పట్ల పాఠ శాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృం దం, జిల్లా విద్యాశాఖ యంత్రాంగం, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 600కు పైగా కథలు రాగ, ఈ పోటీలో నిజామాబాద్ జిల్లా నుంచి ఒక్క గీతా లహరి మాత్రమే ఎంపిక కావడం విశేషమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థినిలోని సృజనాత్మకతను గుర్తించి, కథల రచనపై ఆసక్తిని పెంపొందిస్తూ ప్రోత్సహించిన వసంత మేడంకు, సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అభినందిం చా రు. విద్యార్థులు చదువుతో పాటు సాహిత్యం, రచన రంగాల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని, ఇలాంటి పోటీలు వారిలో సృజనాత్మక, ఆలోచనలను అభివృద్ధి చేస్తాయని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. గీతా లహరి సాధించిన గుర్తింపు పాఠశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# ఎల్ నినో ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి.

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలి.

### సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు కె. రాజేశ్వర్,



భీమ్ గల్, బతుకమ్మ :ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి,నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు కె. రాజేశ్వర్, అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్ ) ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్. దామోదర్ లు డిమాండ్ చేశారు. మండలంలోని భీంనగర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పులు, వర్షాలు సకాలంలో కురవకపోవడం, కరువు పరిస్థితులు నెలకొన్న కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు పంటల నష్టం మరింత భారంగా మారిందని అన్నారు. పంటలు చేతికి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలన్నారు.రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వారు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను సమగ్రంగా అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.రైతులు సాగు కోసం చేసిన అప్పుల భారాన్ని తగ్గించేందుకు రుణ ఉపశమన చర్యలు చేపట్టాలని, పంటల బీమా పరిహారాన్ని అర్హులైన రైతులందరికీ అందేలా చూడాలని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర పెట్టుబడుల విషయంలో రైతులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు.రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయకూడదని,వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధి దెబ్బతిన కుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల కార ణంగా వ్యవసాయ పనులుతగ్గిపోతే వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే ప్రత్యేక చర్యలు చేపట్టా లన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతున్నప్పుడు వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు బాధ్య తగా వ్యవహరించాలని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు అమలు చేయాలని అన్నారు.రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఏ ఐ యు కె ఎస్ మండల నాయకులు యు.అశోక్, ఎం.శ్రావణ్, డి.మోహన్, జి. లింబాద్రి, ఏ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు .

# స్వార్థ సమాజంలో సామాజిక సేవ చేసే వారు అరుదు

### తండ్రి అల్లపుల్ల రాజయ్య స్మారక గ్రంథాలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన దాతలు గంగారెడ్డి దంపతులు.

### ఉద్యమకాలం నుంచే సమాజ సేవలో ముందున్న నిస్వార్థపరుడు గంగారెడ్డి

### మోతె జడ్పీ హైస్కూల్‌లో అల్లపుల్ల రాజయ్య స్మారక గ్రంథాలయం ప్రారంభం

### మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్ బతుకమ్మ :నేటి స్వార్థపూరిత సమాజంలో అధిక శాతం మంది “నేను, నా కుటుంబం, నా సంపద” అనే ఆలోచనలకే పరిమితమవుతున్న ప్రస్తుత తరుణంలో, సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ నిస్వార్థంగా ముందుకు వచ్చే వ్యక్తులు చాలా అరుదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మోతె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివంగత అల్లపుల్ల రాజయ్య స్మారకార్థం సుమారు రూ. 11 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన గ్రంథాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ సభనిద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. నా అనే స్వార్థం వదిలి ప్రజా సేవ చేయాలనే సంకల్పం గలవారిలో అరుదైన వ్యక్తి మోతెకు చెందిన తన మిత్రుడు గంగారెడ్డిఅని అన్నారు. ఆయన ఒక ఆణిముత్యం లాంటి వారని, ఆయన ఏమీ అపర కుబేరుడు కాకపోయినప్పటికీ, తాను కష్టపడి సంపాదించిన పరిమిత రాబడి నుంచే సమాజ హితం కోసం నిధులు వెచ్చిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలకు సతీమణి వసంత, కుమారుడు శ్రేయాంశ్ సంపూర్ణ మద్దతు ఇవ్వడం ఎంతో ఆదర్శనీయమని, కుటుంబ సహకారం లేకపోతే ఇటువంటి ఉన్నతమైన ఆశయాలు సాకారం కావని స్పష్టం చేస్తూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. గంగారెడ్డితో తనకు గత 12-13 సంవత్సరాలుగా అత్యంత సన్నిహిత అనుబంధం ఉందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో లండన్ నుంచి వచ్చిన తొలినాళ్లలోనే, ఎలాంటి వ్యక్తిగత లాభాపేక్ష ఆశించకుండా కేవలం స్వరాష్ట్ర సాధన పట్ల ఉన్న బలమైన నిబద్ధతతో లక్షలాది రూపాయల స్వంత నిధులను వెచ్చించి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని కొనియాడారు. కరోనా మహమ్మారి సంక్షోభ సమయంలోనూ, అంతకుముందు అనేక సామాజిక అంశాల్లోనూ గంగారెడ్డి నిస్వార్థంగా ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు.

గ్రంథాలయం కోసం వెచ్చించిన రూ. 11 లక్షల విరాళం కంటే, ఆ గ్రంథాలయం విద్యార్థులకు నిరంతరం ఏ విధంగా ఉపయుక్తంగా ఉండాలనే దానిపై గంగారెడ్డి చేసిన కసరత్తు, వెచ్చించిన వందలాది గంటల సమయం రూ. 11 కోట్లతో సమానమని ఎమ్మెల్యే కొనియాడారు. భీమ్‌గల్‌లో సీనియర్ విద్యావేత్త డాక్టర్ వసంత్ రెడ్డి గ్రంథాలయం ఏర్పాటు చేసిన తర్వాత ఎదురైన నిర్వహణ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, మోతెలో విద్యార్థులకు గ్రంథాలయం నిరంతరం చేరవయ్యేలా ఒక సమగ్రమైన కార్యాచరణను రూపొందించారని ప్రశంసించారు. ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పుస్తక పఠనాన్ని విద్యార్థులకు అలవాటుగా మార్చడం, చదివిన విషయాలను సమీక్షించుకుని వీడియోల రూపంలో సోషల్ మీడియా/యూట్యూబ్‌లో ప్రదర్శిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించే ప్రణాళికను ప్రశంసించారు. తరగతి గదిలోని పాఠ్యపుస్తకాలు కేవలం పరీక్షల ఉత్తీర్ణతకు, మార్కులకు మాత్రమే పరిమితమవుతాయని, కానీ గ్రంథాలయంలోని పుస్తకాలు లోకజ్ఞానాన్ని, మహనీయుల జీవిత చరిత్రలను, ఉత్తమ సంస్కారాన్ని నేర్పుతాయని విద్యార్థులకు సూచించారు.

ఒక మంచి పుస్తకం పక్కన ఉంటే ఒక మంచి ప్రాణస్నేహితుడు, మార్గదర్శకుడు మన వెంట ఉన్నట్లే” అని పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు శ్రావణి ప్రస్తావించిన మాటను ఎమ్మెల్యే గుర్తుచేశారు. దాత గంగారెడ్డి ఈ గ్రంథాలయంలో ఏకంగా 6,000 పుస్తకాలను సమకూర్చడం ద్వారా విద్యార్థుల్లో ప్రతి ఒక్కరికీ 6,000 మంది నూతన స్నేహితులను అందించారని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిరంతరం పుస్తకాలు చదవాలని పిలుపునిచ్చారు. దాతగా గంగారెడ్డి తన బాధ్యతను సంపూర్ణంగా పూర్తి చేశారని, ఇకపై ఈ గ్రంథాలయాన్ని విజయవంతంగా నడిపించి పిల్లలను గ్రంథాలయ బాట పట్టించే ప్రధాన బాధ్యత ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులపైనే ఉందని ఎమ్మెల్యే ఉద్ఘాటించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల గ్రంథాలయానికి పంపించి చదివించేలా బాధ్యత తీసుకోవాలని కోరారు.

సమాజంలో అనేక రకాల దానాలు ఉన్నప్పటికీ విద్యా విజ్ఞానాలను పంచే ‘జ్ఞానదానం’ అన్నింటికంటే మహోన్నతమైనదని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతూ సమతుల్యతతో వ్యవహరిస్తున్న గంగారెడ్డి కుటుంబాన్ని భగవంతుడు ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని, వారిపై గ్రామాశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో తనను భాగస్వామిని చేసినందుకు మోతె గ్రామ ప్రజలకు, నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వసంత్ రెడ్డి, మోతె గ్రామ సర్పంచ్ రమేష్ రెడ్డి, ఉపసర్పంచ్ పరంజ్యోతి, పీఏసీఎస్ ఛైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్ పెద్దోళ్ల గంగారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు శంకర్, తపస్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి కిషన్, హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు బాలరాజు, డోళ్ళ రాజేశ్వర్, భూపాల్, పాఠశాల ఉపాధ్యాయిని శ్రావణి, పాఠశాల బోధనా-బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

